# రమణభాస్కర

## (ఖండవల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 12-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అజ్ఞానం ఉంది కాబట్టి పుట్టాము. అజ్ఞానం లేకపోతే ఈ భూమిమీదకు రావలసిన పనిలేదు. మీరు కంగారుపడితే ఈ అజ్ఞానం ఒక రోజులో పోదు. ఈ భూమిమీదకు వచ్చేసాము. ఏదో రోజు శరీరం మరణిస్తుంది. శరీరం అదృశ్యం అవుతుందా, శవం అవుతుందా అది వేరే విషయం. అంత తీవ్రంగా ఆలోచించవలసిన విషయం కాదు. అది భౌతిక విషయం. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటి అంటే అజ్ఞానం ఉంది కాబట్టి శరీరం వచ్చింది. శరీరం మరణించేలోపులో ఈ అజ్ఞానమును పోగొట్టుకొంటే మరల శరీరం రాదు. మరణించేలోపు అజ్ఞానమును తొలగించుకోకపోతే మరల పుడతాము. ఇప్పుడు ఎలా పుట్టామో అలాగే మరల పుడతాము. దాని గురించి బుర్రపాడుచేసుకోవద్దు.

దేహాన్ని విడిచిపెట్టాలి అని నీకు లేదు. నీకు ఇష్టంలేకపోయినా అది నిన్ను విడిచిపెట్టేస్తుంది. నీలోపల ఉన్న నేరస్తుడు ఎవడో, ఎవడైతే దుఃఖ కారకుడో, ఎవడైతే సైతానో వాడిని నీవు ఈ శరీరం విడిచిపెట్టకముందే విడిచిపెట్టేయి. వాడిని విడిచిపెడితే ఇక్కడే నీకు మోక్షానుభవం తెలుస్తుంది. అప్పుడు నీకు శాంతి కలుగుతుంది. ఆ శాంతిని ఎవడైతే అనుభవిస్తున్నాడో వాడి దగ్గర కూర్చొన్నప్పుడు ఎంతో కొంత మనకు కూడా వచ్చేస్తుంది. ఆపుచేసుకుందామన్న అది ఆగదు.

ఇతరులకంటే ఎక్కువవాడిని అనుకోవద్దు తక్కువవాడిని అని అనుకోవద్దు. వాటితో కాలమును పాడుచేసుకోవద్దు. తోటి మానవుడికంటే ఎక్కువవాడిని అనుకొంటే పొగరుబోతుతనం, అహంభావన, గర్వం పెరుగుతాయి. అలా పోల్చుకోవలసిన పనిలేదు. ఎవడి దేహప్రారబ్దమునుబట్టి వాడి యాత్ర సాగుతూ ఉంటుంది. పోలికల గొడవ వదిలివెయ్యి. బాహ్యపరిస్థితులనుబట్టి అలా అనిపిస్తుంది. నీ పరిస్థితిని చూసుకొని అభివృద్ధి పొందటానికి ప్రయత్నం చెయ్యి. అనుకరణ వద్దు. అనుకరణ పిరికివాడి లక్షణము. స్వతంత్రముగా ఆలోచించుకో. ఎదుటివాడికంటే ఎక్కువవాడిని, తక్కువవాడిని అని అనుకోవటం నీ ఆధ్యాత్మిక అభివృద్ధిని ఆటంకపరుస్తుంది. నీ మనస్సు సమానంగా ఉండదు. సమానముగా ఉన్న మనస్సు బ్రహ్మంలో ఐక్యమవుతుందిగాని హెచ్చుతగ్గులు ఉన్న మనస్సు బ్రహ్మంలో ఐక్యంకాదు. నీ మనస్సులో ఉన్న హెచ్చుతగ్గులను తగ్గించుకోవాలి. మనస్సును సమానంగా ఉంచుకోవాలి. అనాలోచితంగా ఉండవద్దు.

ఒకరు భగవాన్ దగ్గరకు వచ్చి ఉపాసన, ధ్యానం, విచారణ చేస్తున్నాను. నాకు బ్రహ్మలోకమునకు వెళ్ళాలని ఉంది అని చెప్పాడు. శరీరం మరణించిన తరువాత జీవుడు బ్రహ్మలోకంలో ఉండాలని నా కాంక్ష. నా సాధన అంతా దానికే గురిపెడుతున్నాను అని చెప్పాడు. ఎవడైతే బ్రహ్మలోకానికి వెళ్ళాలనుకొంటున్నాడో వాడిలోనుండి విడుదలపొందితే ఇప్పుడే ఇక్కడే నీకు బ్రహ్మ నిష్ట కలుగుతుంది అని భగవాన్ చెపుతున్నారు. బ్రహ్మలోకం వెళ్ళాలంటే ఈ శరీరం చనిపోవాలి. బలవంతంగా ఇప్పుడు చనిపోదు కదా ఈ శరీరం చనిపోయేవరకు నీవు ఆగాలి. బ్రహ్మలోకం ఎవడైతే వెళ్ళాలి అనుకొంటున్నాడో వాడిలోనుండి విడుదల పొందితే ఇప్పుడే ఇక్కడే ఈ క్షణంలోనే నీకు బ్రహ్మనిష్ట కలుగుతుంది. బ్రహ్మనిష్ట కలిగిన తరువాత నీవు

ఏమీపోవు. బ్రహ్మలోకమునకు వెళ్ళాలనుకొనేవాడు అప్పుడు ఉండడు.

శరీరం మరణించిన తరువాత ఎవడైతే ఉంటాడు అనుకొంటున్నావో విచారణ చేస్తే ఇప్పుడే వాడు లేడని నీకు తెలుస్తుంది అని బుద్ధుడు చెప్పాడు. ఈ వాక్యం అర్థమయితే మీకు సాధన అక్కరలేదు. కాని సాధన లేకపోతే ఈ వాక్యం అర్థంకాదు. భగవంతుని వాక్యం అర్థంచేసుకోవటానికి సాధన ఉండాలి. విచారణ చేయటంలేదు కాబట్టి వాడు ఉన్నాడు అనుకొంటున్నావు. వాడికూడా తిరుగుతున్నావు. మనస్సు ఏది చెపితే అది చేస్తున్నావు. కాని ఈ మనస్సు ఎవరు అనే ప్రశ్నవేయటం లేదు. నీ మొఖంలో ఎప్పుడూ అవినయం కనబడకూడదు. నీకుకనుక వినయం లేకపోతే ఆత్మవిచారణచేయటానికి నీ మనస్సు అంగీకరించదు. వినయం ఉన్న మనస్సు ఆత్మ విచారణ చేయటానికి అర్హత సంపాదిస్తుంది. వినయంలేని మనస్సు, స్థూల మనస్సు ఆత్మవిచారణ చేయలేదు.

శరీరం ఏదో రోజుమరణిస్తుంది. దాని ప్రారబ్దం పూర్తి అవ్వగానే శరీరం మరణిస్తుంది. శరీరం ఈ భూమిమీద ఎంత కాలం ఉంటుంది, ఎప్పుడు మరణిస్తుంది అని వాటిగురించి ఆలోచించకు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి నీ దేహం అడ్డురావటంలేదు. నీ అహంభావన అడ్డువస్తోంది. నీ దేహం అడ్డురావటంలేదు. దేహము నేను అనే బుద్ధి అడ్డువస్తోంది. దానిని తొలగించుకోవటానికి ప్రయత్నించు. చావుకోసం ఎదురుచూడవద్దు. నీ అహంభావన పల్చబడుతోందా, లేదా అది చూసుకో. ఏది పోతే నీవు ఎవరవో నీకు తెలుస్తుందో దానిని పోగొట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యి. పాతబట్టలు తీసివేసి కొత్తబట్టలు వేసుకొన్నావు అనుకో. దానివలన నువ్వు ఏమన్నా మారతావా, నీకు వివేకం కలిగిందా అంటే ఏమీ లేదు. బట్టలు మారాయి అంతే నీవు అలాగే ఉంటావు. అలాగే చనిపోయినంతమాత్రంచేత నీ అహంకారము పోతుంది అని అనుకోకు. చనిపోవటంవలన పాతదేహం పోతుంది కొత్తదేహం వస్తుంది అంతేగాని నీ అహంకారము ఇప్పుడు ఎలా ఉందో అప్పుడుకూడా అలాగే ఉంటుంది. నీవు సాధనచేసి ఈ లోకంలో ఉండగా దానిని తొలగించుకోవటానికి ప్రయత్నంచెయాలిగాని చనిపోయిన తరువాత సాధన చేయటానికి ఏమీ ఉండదు. నీవు పుణ్యంచేసి వైకుంఠమునకు వెళితే చేసిన పుణ్యమును enjoy చేయవచ్చును గాని అక్కడ సాధన చేసి అహంభావనను పోగొట్టుకోవటానికి అవకాశం లేదు. తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. పుణ్యం అనుభవించే లోకాలు, పాపం అనుభవించే లోకాలు నీ సాధనకు పనికిరావు. సాధనచెయ్యటానికి ఇక్కడకు రావలసిందే అని పరమాత్మ చెపుతున్నాడు. అయితే ఇతర లోకాలు లేవనికాదు నీ మనస్సు ఎంత నిజమో అవి అన్నీకూడా అంతే నిజం.

మనం స్టేషన్‌కు వెళ్ళాము. ఏదో మాట్లాడుకొంటున్నాము అనుకోండి రైలు వస్తే ఏదో మాట్లాడుకొంటున్నాము రైలు పోతే పోతుంది అని అనుకొంటామా. రైలులో కూర్చొని మాట్లాడుకొనే మాటలు మాట్లాడుకొంటాము. అదే భగవాన్ చెపుతున్నారు. మీరు ఈ భూమిమీదకు ఎందుకు వచ్చారు. మోక్షం పొందటానికి వచ్చారు. ముందు మోక్షాన్ని పొందండి. తరువాత ఈ శరీరం శవం అవుతుందా, అదృశ్యమవుతుందా ఈ విషయములు చూసుకోండి. రైలు వచ్చినవెంటనే రైలులో కూర్చోండి. తరువాత విషయాలు మాట్లాడుకోవచ్చును. మీరు రైలు వదిలివేస్తారు అనుకోండి ప్రయాణం ఆగిపోతుంది. రైలు ఎక్కిన తరువాత ఏమన్నా విషయాలు ఉంటే మాట్లాడుకోండి. అలాగే మోక్షం పొందిన తరువాత ఇంకా పొందవలసినవి ఏమైనా ఉంటే చూసుకోండి. దానివలన నష్టంలేదు. ప్రయాణం ఆగిపోదు. మనం ఏమి చేస్తున్నాము అంటే రైలును దాటపెట్టి ప్లాటుఫారంమీద కూర్చొని మాట్లాడుకొంటున్నాము. వచ్చిన పని మర్చిపోతున్నాము.

నేను అనే తలంపు నీలోపలనుండే వస్తోంది గాని అది ఎక్కడనుండి వస్తోందో మనకు తెలియటంలేదు.

అది ఎక్కడనుండి వస్తోంది అని నిరంతరము దాని మూలాన్ని వెదకటం ప్రారంభించు. దేవుడు ఉన్నాడా, లేడా అనే గొడవ వదిలివెయ్యి. దేవుడు లేకపోతే ఏ గొడవ లేదు, నిజంగా ఉంటే నీ అవసరం వాడికి లేదు. నీకు కావలసినది దేవుడు కాదు. నీకు సుఖం, శాంతి కావాలి. ఆ సుఖము, శాంతిని ఎవడైతే కప్పుతున్నాడో వాడిని అర్జెంటుగా తొలగించాలి. నిరంతరము కూర్చొన్నా, నిలబడిఉన్నా నీ దృష్టిని దానిమీద పెట్టు. మన ఇంటికి దొంగ వచ్చాడు అనుకోండి. ఇంటిలోనివారంతా బాగా నిద్రపోతున్నారా అని చూస్తాడు. వాడు మాత్రం నిద్రపోడు. వాడి దృష్టి అంతా డబ్బుమీద ఉంటుంది. డబ్బుమీద వాడి దృష్టి ఎలా ఉంటుందో అలాగే నేను యొక్క మూలం మీద నీ దృష్టి ఉండాలి. నీ మనస్సు ఆ మూలంమీదే ఉండాలి. మనస్సుయొక్క చలనంమీద నీ దృష్టిపెట్టవద్దు. మనస్సుకు ఆధారంగా ఉన్న ఆ మూలంమీద నీ దృష్టిని పెడితే మనస్సుయొక్క చలనం ఆగిపోతుంది. మనస్సుయొక్క చలనం ఎప్పుడైతే ఆగిపోయిందో దానిమూలం నీకు తెలుస్తుంది. ఆ మూలం ఎప్పుడైతే నీకు తెలిసిందో నిజమైన నేను నీకు తెలుస్తుంది. ఇప్పుడు ఏదైతే నేనుగా నీకు వ్యక్తమవుతోందో ఆ మిధ్యానేనును తొలగించి నిజమైన నేను అప్పుడు నీకు నేనుగా వ్యక్తమవుతుంది.

దేవుని పూజించమంటే ఇష్టపడతారుగాని దేవుని తెలుసుకోవటానికి ఇష్టపడరు. దేవుని తెలుసుకుంటే ఈ నేను పోతుంది అని చాలామందికి భయం. ఈ సృష్టిలో అన్నింటికంటే ఈ నేను అంటేనే మనకు ఎక్కువ ఇష్టం. నేను మంచిపనిచేసాను, నేను పుట్టాను, నేను చనిపోతున్నాను, నేను తెలివిగలవాడిని. అన్నింటిలోనూ నేను ఉంది. నీకు గంపెడు తెలివితేటలు ఉన్నాయి. తెలివి కలిగి ఉన్న ఆ నేను ఎవరో ఈ తెలివిని ఉపయోగించి నీవు తెలుసుకో. అప్పుడు ఆ నేను అంటే మిధ్యానేను పోతుంది. మిధ్యానేను పోతే మీరు పోతారు అని కంగారు పడకండి. మీరు ఎవరో మీకు తెలుస్తుంది. ఇప్పుడు మెదడులో నీ మనస్సు ఎంత సహజముగా ఉంటుందో అంత సహజముగా నీ మనస్సును ఆధ్యాత్మిక హృదయంలో ఉంచగలిగితే నీ మనస్సు అక్కడ కరిగిపోతుంది. మాయ ఎక్కడ ఉంది మనస్సులో ఉంది. ప్రకృతి గుణాలు ఎక్కడ ఉన్నాయి. మనస్సులో ఉన్నాయి. ఈ మనస్సు ఎప్పుడైతే కరిగిపోయిందో మాయ కరిగిపోతుంది, ప్రకృతి గుణాలు కరిగిపోతాయి. అప్పుడు వాడు ప్రకృతిని దాటి వెళ్ళిపోతాడు.

నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. మనస్సుయొక్క మూలంకూడా నీలోపలే ఉంది. అక్కడే నిజమైన గురువు ఉన్నాడు. సర్జరీ వాడే చేయాలి. బాహ్యమైన గురువును తక్కువగా చూడకూడదు. బాహ్యగురువు మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తాడు. ప్రేమించటంలోకూడా ఉద్దేశ్యం ఉంది. లోపల గురువుకు మిమ్మల్ని స్వాధీనం చేయటంకోసం. అంత ప్రేమించకపోతే వాడు చెప్పినమాట మీరు వినరు. వాడు చెప్పిన మాట మీరు వింటేనేగాని మీ మనస్సు అంతర్ముఖం కాదు. అంతర్ముఖం అవ్వటానికి మీ మనస్సును prepare చేసి వాడు తప్పుకొంటాడు బయట గురువు నీమనస్సును హృదయంవైపుకు వెళ్ళటానికి నడక నేర్పుతాడు. మనస్సు హృదయం వైపుకు ప్రయాణం చేయటం మొదలుపెడితే సగం పని పూర్తి అయినట్లే. అప్పుడు లోపల గురువు చేయవలసిన సర్జరీ చేస్తాడు. అప్పుడు realization కలుగుతుంది.

ఎవరికైనా ఏదైనా విషయం మనం చెప్పాలనుకొంటే సలహా రూపములో చెప్పాలికాని విమర్శరూపములో చెప్పకూడదు. విమర్శన రూపములో చెపితే మన మనస్సు పాడవుతుంది. దేవుడిని మనం ఎలా అడగాలంటే నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పము అని అడగాలి. ఎందుచేతనంటే మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కువగా దేవుడికి తెలుసు. దేవుని చేతిలో పనిముట్టుగా నీవు మారిపోవాలి.

మనం ఎందుకు ఇలా ఉన్నాము. గాంధీగారు మహాత్ముడు ఎందుకు అయ్యాడు. మనం దేనినైతే గట్టిగా పట్టుకొన్నామో ఆయన వాటిని వదిలేసాడు. మనం ఈ నేనును, దానికి సంబంధించిన విషయాలను గట్టిగా

పట్టుకొన్నాము. ఆయన వాటిని వదిలివేసాడు. వాటిని వదిలివేసాడు కాబట్టి ఆయన మహాత్ముడు అయ్యాడు. మనం వదలలేదు కాబట్టి దురాత్ములుగా ఉన్నాము. విషయ చింతన వదిలివేస్తే మహాత్ముడు అవుతాడు.

మనలను ఎవరైనా ప్రశ్న అడిగితే ఏదో నోటికి వచ్చింది చెప్పేస్తాము. ఏదైనా పేచీ వచ్చే ప్రశ్నవేస్తే నువ్వువేసే ప్రశ్నకు సమాధానం చెపితే అది ఎక్కడకు ఈడ్చేస్తుందో నాకు తెలుసు అందుకని చెప్పను అనేవారు భగవాన్. అవసరం అయినపుడు సమాధానం చెప్పేవారు అవసరం లేనపుడు చెప్పేవారుకాదు. ఆలోచనకూడా కొంతవరకూ అవసరమే. విషయం వచ్చినపుడు ఆలోచించాలి. కాని ఆలోచనే నీ గమ్యంకాదు, నీ స్వరూపం కాదు. ఆలోచనే నీ స్వరూపం అయితే గాఢనిద్రలో ఆలోచన నిన్ను విడిచిపెట్టకూడదు.

మనకు జన్మలకు కారణం కర్తృత్వం. కర్తృత్వం అంటే దేహబుద్ధి. దేహంలోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది అనుకొంటున్నాము. మీలోపలే ఉన్నాను అని కృష్ణుడు చెప్పాడు. మనం లోపలే ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి మనకు తగినట్లుగా చెప్పటంకోసం కృష్ణుడు అలా చెప్పాడు. అలాగని బయట లేడు అని కాదు అంతటా ఉన్నాడు. అంతటా ఉన్నాము అని మనం అనుకోవటంలేదు. లోపలే ఉన్నాము అని అనుకొంటున్నాము. మీ హృదయంలో నేను ఉన్నాను అని కృష్ణుడు చెప్పాడు. మీ హృదయంలో ఉన్న ఈ నేనుయొక్క మూలం తెలిసాక ఇక్కడ ఉన్నదే అంతటా ఉంది అని నీకు తెలుస్తుంది. దానికి, దీనికి బేధం లేదు అని నీకు తెలుస్తుంది.

చివరి రోజులలో భగవాన్‌తో కొంతమంది భక్తులు మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఇక్కడ ఉండిపోతున్నాము అన్నారు. నేను ఎక్కడికి వెళ్ళిపోవటం లేదు. వెళ్ళిపోవటానికి చోటు ఉండాలి కదా అన్నారు భగవాన్. అంతటా ఉన్న వస్తువు ఎక్కడికి వెళుతుంది. అంతటా ఉన్న వస్తువుకు రావటంలేదు, పోవటం లేదు. ఓ అరుణాచలేశ్వరుడా! నా అహంభావనను అలంకరించుకోవటానికి నీ దగ్గరకు వచ్చాను. నువ్వు ఏమి చేసావు అంటే దేనినైతే అలంకరించుకోవటానికి నీ దగ్గరకు వచ్చానో దానిని తీసివేసావు. ఎంతపనిచేసావు. తీసేసినపుడు నాకు తెలిస్తే అహంభావనను పట్టుకొని ఉండేవాడను. కాని ఆ సంగతి నాకు తెలియకుండానే తీసేసావు అన్నారు భగవాన్. ఎవడో ఒక రమణమహర్షిని బాగు చేసాను నాపని పూర్తిఅయ్యింది అని అనుకోకు నా శరీరం ఊడిపోయినా నీవు చిరకాలం, కలకాలం ఇలాగే ఉండాలి. నన్ను ఏవిధంగా అయితే జ్ఞానముతో అలంకరించావో అలాగే రాబోయే జీవకోటిమీదకూడా నీ అనుగ్రహం చూపించి వారిని కూడా జ్ఞానముతో అలంకరించు అని భగవాన్ ప్రార్థించారు.

డబ్బు లేనివారు అందరూ డబ్బు సంపాదించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. భగవాన్ ఏమనిచెప్పారు అంటే నీకు సత్పురుషుల సహవాసం లేదు అనుకో సత్పురుషుల సహవాసమును సంపాదించుకో. డబ్బులేనివారు అందరు మాకు డబ్బులేదు, మాకు డబ్బు లేదు అని ఊరుకొంటున్నారా డబ్బు సంపాదించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. అలాగే సత్పురుషుల సహవాసం నీకు లేదు అనుకో ఆ సహవాసమును సంపాదించుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

❋ ❋ ❋